క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యేకు సత్కారం

మైదుకూరు : వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమించేందుకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిని సోమవారం మైదుకూరుకు చెందిన దండు వెంకటసుబ్బయ్య (ఎంఆర్ఎఫ్) సత్కరించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో సత్కరించి ఎంఆర్ఎఫ్ సుబ్బయ్య ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పార్టీకి మరిన్ని సేవలు చేసే అవకాశం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దళితులకు న్యాయం చేయాలి

చాపాడు: మండలంలో 30 ఏళ్ల క్రితం ప్రభుత్వం దళితులకు ఇచ్చిన భూములు, ఇళ్ల స్థలాలు ప్రస్తుత పరిస్థితుల్లో అన్యాక్రాంతమవుతున్నాయని, పలుకుబడి ఉన్న వ్యక్తులు, రియల్టర్లు తమకు అనుకూలంగా రికార్డులు సృష్టించుకుని ఆక్రమణలకు పాల్పడుతున్నారని వీటిపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుని కాపాడాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ రామసుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. దళితులకు న్యాయం చేయాలని కోరారు.ఈ మేరకు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహసీల్దారు రమాకుమారికి చాపాడు దళితవాడకు చెందిన రెడ్డితోట జేమ్స్ కుటుంబీకులు ఫిర్యాదు చేశారు.

పరామర్శ

పోరుమామిళ్ల : ఇటీవల మోకాలు ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విశ్రాంత ఉపాధ్యాయుడు, వాస్తు పండితుడు గురివిరెడ్డిని సోమవారం పంచాయతీ రాజ్ రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి, ఆయన సతీమణి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

అట్లూరు : బద్వేలు పట్టణంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక గిద్దలూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథ ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు శివకుమార్, సభ్యులు లీలానారాయణ, భాగ్యం, సుభాషిణి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా రామసుబ్బారెడ్డి

బద్వేలు అర్బన్ : ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం బద్వేలు యూనిట్ తాత్కాలిక అధ్యక్షులుగా ఎద్దుల రామసుబ్బారెడ్డిని ఎన్నుకున్నట్లు ఆ సంఘం కార్యదర్శి కె.బ్రహ్మయ్య తెలిపారు. గతంలో అధ్యక్షులుగా పనిచేస్తున్న డాక్టర్ మీనాక్షిరెడ్డి మృతి చెందడంతో సోమవారం కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో సభ్యులందరూ ఏకగ్రీవంగా రామసుబ్బారెడ్డిని ఎన్నుకున్నట్లు తెలియజేశారు.

తైక్వాండో బ్లాక్ బెల్ట్‌లో ప్రతిభ

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన కార్తవార్జున్ రాయుడు, యువరామ్ రెడ్డి, వేద అభిరామ్ రెడ్డి, పునీత్ రెడ్డి తైక్వాండో బ్లాక్ బెల్ట్‌కు అర్హత సాధించారని మాస్టర్ మునీశ్వర్ సోమవారం తెలిపారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రం ఇండోర్ స్టేడియంలో శని, ఆదివారాల్లో జరిగిన బ్లాక్ బెల్ట్ పరీక్షల్లో ఈ విద్యార్థులు ప్రతిభ చూపారని ఆయన పేర్కొన్నారు. స్థానిక ఎద్దుల వెంకటసుబ్బమ్మ బాలికల ఉన్నత పాఠశాలలోని జవహర్ బాల కేంద్రంలో ఈ విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. వీరు వైజాగ్‌లో సెప్టెంబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఆలయ భూమి వేలం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆలయానికి సంబంధించిన భూముల వేలం, హుండీ ఆదాయాన్ని లెక్కించారు. సోములవారిపల్లె పంచాయతీలోని 39.84 ఎకరాల భూమికి వేలం వేయగా రూ.3,73,500 వచ్చిందని ఆలయ ఈఓ శ్రీధర్ తెలిపారు. హుండీ ఆదాయం లెక్కించగా రూ.1,27,657 ఆరు నెలలకు భక్తులు కానుక రూపంలో సమర్పించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆలయ చైర్మన్ రాజారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

ప్రొద్దుటూరు క్రైం : లింగనిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గీత తెలిపారు. ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలోని పీపీ యూనిట్‌లో సోమవారం సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైజరీ కమిటీ మీటింగ్ నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గీత మాట్లాడుతూ ఆడబిడ్డలను రక్షించాలంటే లింగ నిర్ధారణ, గర్భస్రావాలు జరగకుండా చెయ్యాలని చెప్పారు. ఆడపిల్ల పుట్టిందంటే బరువు అవుతుందనే ఆలోచన చాలా మందిలో ఉందన్నారు. ఆడపిల్లలైనా, మగబిడ్డ అయినా ఇద్దరూ సమానమే అనే భావనను వారిలో కలిగించాలని చెప్పారు. జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రూపానంద్, కమిటీ సభ్యులు గైనకాలజిస్టు డాక్టర్ యశస్విని, డాక్టర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి తిరిగి చంద్రబాబు మోసాన్ని ఎండగడతాం

మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి

మైదుకూరు : వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటికి తిరిగి చంద్రబాబు మోసాన్ని ఎండగట్టేందుకు గ్రామాల్లో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. సోమవారం మైదుకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బాబు మేనిఫెస్టోను గుర్తు చేద్దాంపై మండల స్థాయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ సుపరిపాలనలో తొలి అడుగు అంటూ కూటమి ప్రభుత్వం ఇంటింటికి తిరగడం సిగ్గుచేటని అన్నారు. ఏం చేశారని ప్రజల వద్దకు వెళుతున్నారు అని ప్రశ్నించారు. సుపరిపాలన అంటే చెప్పినవన్నీ చేసి మంచి పాలనను అందించాలి.. అంతేకానీ హామీలు నెరవేర్చకుండా మోసం చేయడం కాదని పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా చేసిన అనేక సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాల గురించి తాము ప్రతి సచివాలయం వద్ద ప్రజలకు తెలిపే విధంగా ఫ్లెక్సీలను వేస్తామని గుర్తు చేశారు. ఆ విధంగా టీడీపీ వారు చేయగలరా అన్నారు. వైఎస్ జగన్ హయాంలో మైదుకూరు మండలంలోని ఒక్క గంజికుంట సచివాయలం పరిధిలోనే రూ.20 కోట్ల మేరకు సంక్షేమం, అభివృద్ధి పనులు చేశామని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇల్లులేని 16 లక్షల మంది పేదలకు ఇంటి స్థలాలను ఇచ్చామన్నారు. 10 లక్షల మందికి పక్కా ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. మైదుకూరు మండలంలో పీహెచ్‌సీలను, మున్సిపాలిటీలో అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. మైదుకూరులో ఉన్న 30 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్చామని గుర్తు చేశారు. పాలిటెక్నిక్ కళాశాలకు రూ.32 కోట్లు నిధులు మంజూరు చేయించామన్నారు. ప్రజలకు మేలు చేయలేదు కాబట్టే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అరాచకాలను సృష్టిస్తుందని ఆరోపించారు. అడుగడుగునా వైఎస్సార్‌సీపీ శ్రేణులకు, నాయకులకు ఆంక్షలు విధిస్తున్నారన్నారు. రైతులను, బాధితులను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించేందుకు వెళితే కూటమి ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏమిటో చెప్పాలన్నారు. శాంతి భద్రతల సమస్యలు ఏర్పడితే పోలీసులు ఆంక్షలు విధించాలి కానీ శాంతియుతంగా పరామర్శిస్తే పోలీసు ఆంక్షలు ఎందుకని ప్రశ్నించారు. ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారని అనుకోవడం లేదన్నారు. ఒక వేళ జరిగితే నూటికి నూరు శాతం వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించి జెండా ఎగురవేస్తుందని స్పష్టం చేశారు.

నేటి నుంచి ఇంటింటికి..

మైదుకూరు మండలంలో మంగళవారం నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాన్ని తెలియజేస్తామని మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏమేమి లబ్ధి చేకూరిందో వివరిస్తామన్నారు. చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను గుర్తు చేసి నెరవేర్చింది లేనిది చెబుతామన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, బండి నాగేంద్ర ప్రసాద్, నేట్లపల్లె శివరాం, మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, భరత్, మున్సిపాలిటీ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎంఆర్ఎఫ్ సుబ్బయ్య, గోశెట్టి లక్ష్మయ్య, భూమిరెడ్డి సుబ్బరాయుడు, ట్రాక్టర్ గౌస్, జమాల్, ఖాదర్, మాబుచాన్, గౌస్, అన్నలూరు శ్రీనివాసులు రెడ్డి, పిల్లి నాగయ్య, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌తో టీడీపీ కనుమరుగు కావడం ఖాయం

ఖాజీపేట : కూటమి ప్రభుత్వంలో సీఎంగా చంద్రబాబు పాలన సాగడం లేదు. మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో పాలన నడుస్తోంది.. లోకేష్‌తోనే టీడీపీ కనుమరుగు కావడం ఖాయం అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. ఖాజీపేటలోని జీఏ ఫంక్షన్ హాల్‌లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ ఎక్కడ పర్యటించినా జనప్రభంజనంగా మారుతోందన్నారు. ఏడాది కాలంలోనే ప్రజలు కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను గుర్తించారన్నారు. మాజీ సీఎం జగన్ పాలనలో సంక్షేమం వందశాతం చేశామని అన్నారు. నేడు కూటమి పాలనలో అన్ని మోసాలే అన్నారు. నిరుద్యోగ భృతి ఎవ్వరికి ఇచ్చారన్నారు. రైతు భరోసా, ఉచిత బస్సు ఎక్కడని ప్రశ్నించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు వైఎస్ జగన్ పాలనలో జరిగితే ఇచ్చిన హామీలను మోసగించి న చరిత్ర కూటమి పాలకులదన్నారు.

కేసులకు భయపడేది లేదు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి చోటా వైఎస్సార్ సీపీ జెండా ఎగరాలన్నారు. నేడు పోలీసుల వేధింపులు, కనీసం చిన్న సర్వే చేయాలన్న అధికారులు పలకడం లేదన్నారు. ఇంత దారుణంగా పాలన ఎక్కడా చూడలేదన్నారు. ప్రజల్లో కూటమి ప్రభుత్వం మోసాలను ఎండగట్టాలన్నారు. అనంతరం మండల కన్వీనర్ మురళీ మోహన్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ పీపీ రాఘవరెడ్డిలు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యేలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కేసీకెనాల్ ప్రాజక్టు కమిటీ మాజీ అధ్యక్షుడు డీఎల్ శ్రీనివాసులరెడ్డి, రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, రైతు విభాగం మైదుకూరు అధ్యక్షుడు నాగిరెడ్డి, ఎంపీటీసీలు బండి శ్రీనివాసులు, కనపర్తి సుబ్బారెడ్డి, కూనవారిపల్లె సర్పంచ్ సుబ్బారెడ్డి, దుంపలగట్టు నాయకుడు రామకృష్ణారెడ్డి, శెట్టిపల్లి సిద్ధారెడ్డి, పత్తూరు వెంకటయ్య, వెంకటసుబ్బయ్య, నాగసానిపల్లె సుధాకర్, గుత్తికొట్టాలు వేమారెడ్డి, చెన్నముక్కపల్లె నాయకుడు రామిరెడ్డి, రావులపల్లె నాగేశ్వర్‌రెడ్డి, అర్బ్సకాలేజీ మాజీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

కాశినాయన : బాలాయపల్లె గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ తెలిపారు. సోమవారం గ్రామంలో ఆర్డీఓ పర్యటించారు. స్థానికులు తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గతంలో గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో వేసిన బోరు నీరు రావడం లేదని ఆర్డీఓ దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. వెంటనే బోరును రిపేరు చేయాలని స్థానిక పంచాయతీ సెక్రటరీని ఆయన ఆదేశించారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించి, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, డిప్యూటీ ఎంపీడీఓ ముజఫర్ రహీం, ఆర్ఐ అమరనాథరెడ్డి, స్థానిక నాయకులు కృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శివాలయం సమీపంలో బుధవారం స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించనున్న రక్తదాన శిబిరంలో ప్రజలు పాల్గొని రక్తదానం చేయాలని స్వచ్ఛ సంస్థల ప్రతినిధులు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం రక్తదాన శిబిరానికి సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్త నిధి కేంద్రాల్లో రక్త నిల్వలు తగ్గిపోవడంతో ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలను నిర్వహించినట్లు తెలిపారు. బుధవారం నిర్వహించే రక్తదాన శిబిరంలో యువత, విద్యార్థులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు. కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థల అధ్యక్షులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగిన బాడ్మింటన్ పోటీలు



బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–11, 13 విభాగాల్లో జిల్లా జట్ల ఎంపికలు జార్జి కారొనేషన్ క్లబ్‌లో ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడల పట్ల రోజురోజుకు ఆసక్తి పెరుగుతోందని తెలిపారు. బ్యాడ్మింటన్‌కు వస్తున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో 11 బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియాలను ఏర్పాటు చేశారన్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ జిల్లా జిలానీ బాషా మాట్లాడుతూ అండర్–11 రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు త్వరలో కడపలో జరగనున్నాయని తెలిపారు. క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభకనబరిచి జిల్లా ఖ్యాతిని పెంచాలని ఆకాంక్షించారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులకు సర్టిఫికెట్లను అందజేశారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు అండర్–11 బాలికల విభాగంలో డి.ప్రణవి, సస్యరాయ్, సారా వాకింగ్స్ (కడప), అండర్–13 విభాగంలో డి.ప్రణవి, ఎం.అక్షర (కడప), నిహతి రెడ్డి, తారికా రెడ్డి(ప్రొద్దుటూరు) ఎంపికయ్యారు. అండర్–11 బాలుర విభాగంలో పీబీజీ గౌతమ్, ఎస్వీ స్వాత్విక్ రెడ్డి, హవిష్ (ప్రొద్దుటూరు), అండర్ 1–13 విభాగంలో ఎ.త్రిషాల్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, పీబీజీ గౌతమ్ (ప్రొద్దుటూరు) ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ కోశాధికారి నాగరాజు, ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సభ్యులు సోని సామ్యూల్, బాల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డులో వ్యర్థాలు వేస్తే చర్యలు



బైపాస్‌రోడ్డులో వ్యర్థాలను పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహారెడ్డి

బద్వేలు అర్బన్ : స్థానిక పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులో భవన నిర్మాణాల, శిథిల వ్యర్థాలు వేస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి హెచ్చరించారు. సోమవారం బైపాస్ రోడ్డులో పర్యటించిన ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇకపై ఎవరైనా బైపాస్ రోడ్డులో వ్యర్థాలు వేస్తే ఒక వాహనానికి రూ.2 వేలు చొప్పున జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. మున్సిపాలిటీలోని 23 మంది ప్లానింగ్ సెక్రటరీలతో నిఘా ఉంచుతామన్నారు. అలాగే పట్టణంలో భవన నిర్మాణాల, శిథిల వ్యర్థాలను సీమాంక్ ఆసుపత్రి పక్కన నీటికుంటలో మాత్రమే వేయాలని సూచించారు. అంతకుముందు ఫీల్డ్ విజిట్‌లో భాగంగా పలు వార్డుల్లో పర్యటించిన ఆయన ఖాళీ స్థలాల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలు లేకుండా స్వచ్ఛందంగా తొలగించుకుని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సంబంధిత యజమానులను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ మహేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే జరిమానా



వాహనదారుడితో మాట్లాడుతున్న డీఎస్పీ

ప్రొద్దుటూరు క్రైం : మైనర్లు బైక్‌లు నడపడం ప్రమాదకరమని, వారికి స్కూటీలు, బైక్‌లు ఇవ్వరాదని ప్రొద్దుటూరు డీఎస్పీ భావన తెలిపారు. పట్టణంలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో సోమవారం సాయంత్రం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మైనర్లు వాహనాలు నడిపితే జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. సైలెన్సర్ లేని వాహనాలు, మైనర్ డ్రైవింగ్, డ్రైవింగ్ లైసెన్స్, రికార్డులు లేని వాహనాలను పోలీసు అధికారులు సీజ్ చేశారు. ప్రొద్దుటూరు సబ్‌డివిజన్ పరిధిలో 45 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వాటిలో మైనర్ డ్రైవింగ్, లైసెన్స్‌లు లేని వాహనాలకు జరిమానా విధించారు. రికార్డులు లేని వాహనాలను తదుపరి చర్యల నిమిత్తం ప్రొద్దుటూరు ఆర్టీఓకు పంపించారు. అనంతరం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద డీఎస్పీ భావన వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

17న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ మహాసభ

బద్వేలు అర్బన్ : సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నియోజకవర్గ ప్రథమ మహాసభను ఈ నెల 17న పట్టణంలోని ఎన్‌జీఓ హోంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు సంగటి చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం బైపాస్ రోడ్డులోని భగత్‌సింగ్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో విస్తారమైన ప్రకృతి సంపద, వనరులు ఉన్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గం వెనుకబాటుకు గురైందన్నారు. ఈ క్రమంలో నియోజకవర్గ అభివృద్ధే పరమావధిగా మహాసభలో భవిష్యత్ కార్యాచరణ రూపొందించి పోరాటాలు కొనసాగిస్తామని చెప్పారు. మహాసభకు ముఖ్యఅతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి బంగారురావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఉదయకిరణ్ హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చంద్రమోహన్‌రాజు, జకరయ్య, నియోజకవర్గ పార్టీ నాయకులు రామరాజు, బాబు, నారాయణ, చంద్రపాల్, మహబూబ్‌బాషా, పాండు తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే అంశాలను ప్రింటింగ్ చేయవద్దు

పోరుమామిళ్ల : విద్వేషాలు సృష్టించే విధంగా ఉండే అంశాలను ఫ్లెక్సీ, కరపత్రాలు, జిరాక్స్ రూపంలో ప్రింటింగ్ చేయవద్దని ఎస్ఐ కొండారెడ్డి సూచించారు. సోమవారం ఆయన ఫ్లెక్సీ, ప్రింటింగ్ ప్రెస్, జిరాక్స్ సెంటర్ల యజమానులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కులాలు, మతాలు, రాజకీయ పార్టీలకు సంబంధించి విద్వేషాలు సృష్టించే అంశాలతో ఎవరైనా ఫ్లెక్సీ, కరపత్రాలు లేదా జిరాక్స్ కాపీలు చేయాలని వస్తే వాటిని తిరస్కరించాలన్నారు. అదే సమయంలో అలాంటి వాటి వివరాలు పోలీసులకు తెలుపాలన్నారు. అలాంటి అంశాలకు సంబంధించి ప్రింటింగ్‌కు వచ్చిన వ్యక్తి పూర్తి వివరాలు తీసుకోవాలని, ఫొటో, ఆధార్ కార్డు తీసుకోవాలన్నారు. పొరపాటున చేసినా చర్య ఉంటుందని హెచ్చరించారు.

కార్మికుల సమ్మెకు మద్దతు

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద తమ డిమాండ్ల సాధనకై ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారం రెండవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్మికుల సమ్మెకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, బాడీ బిల్డర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఇనాయతుల్లా మద్దతు తెలిపారు. సుప్రీం కోర్టు తీరుపమేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని వారు పేర్కొన్నారు. కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని తెలిపారు.

పంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

పోరుమామిళ్ల : పంచాయతీ కార్మికుల కష్టానికి తగ్గ వేతనం ఇవ్వడంలో అధికారులు విఫలమవుతున్నారని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం పోరుమామిళ్ల పంచాయతీ కార్మికుల సమస్యలపై కార్యదర్శి ఓబులేసుకు వినతిపత్రం ఇచ్చారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్, సీపీఐ మండల కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ ఆన్‌లైన్ టెండర్ల ద్వారా కార్మికుల నియామకం చేస్తున్నారని, కానీ ఉద్యోగ భద్రత లేకుండా సంవత్సరాల తరబడి పని చేస్తున్న కార్మికులు చాలని జీతాలతో అల్లాడుతున్నారన్నారు. ప్రతినెల కనీస వేతనం అందించాలన్నారు. సంవత్సరానికి నాలుగు జతల బట్టలు, గ్లౌజులు, సబ్బులు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల నాయకులు సఫా, పీరయ్య, కేశవ, నాగేష్, బాలయ్య, నాగరాజు పాల్గొన్నారు.

హెల్త్‌కార్డు బకాయిలు చెల్లించాలి

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు ఎంప్లాయిస్ హెల్త్‌కార్డుపై మంజూరు చేసే బిల్లులను తక్షణమే చెల్లించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం కడప జిల్లా శాఖ గౌరవాధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆసుపత్రులకు కోట్ల రూపాయలు బకాయిలు ఉన్న కారణంగా ఏ ఆసుపత్రి వారు కూడా ఎంప్లాయిస్ హెల్త్‌కార్డును అంగీకరించడం లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల మొర ఆలకించి బిల్లుల రూపేన రావాల్సిన మొత్తాన్ని మంజూరు చేయాలని కోరారు.

మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు



మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డికి సమ్మె నోటీసు అందిస్తున్న యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కమిషనర్ సి.రవి చంద్రారెడ్డికి సోమవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మ, అధ్యక్షుడు చంటి మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 16 నుంచి పారిశుధ్య కార్మికులు, కోవిడ్ కార్మికులు సమ్మెలోకి వెళుతున్నట్లు తెలిపారు. ఆప్కాస్ కార్మికుల సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని, ఆప్కాస్‌ను రద్దు చేస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని తెలిపారు. దహన సంస్కారాలకు రూ.20వేలు ఇవ్వాలని, కార్మికులు చనిపోతే రూ.2లక్షలు ఇన్సూరెన్స్ ఇవ్వాలని, ఇంటిలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు ఇవ్వాలని, ప్రమాదశాత్తు చనిపోతే రూ.7లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు. కోవిడ్ కార్మికులను ఆప్కాస్‌లో కలపాలని, వారికి కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలని, కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులు, క్యాజువల్ సెలవులు, యూనిఫాం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణ, రాఘవేంద్ర, ప్రమీలమ్మ, సీతమ్మ, రమాదేవి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

పోరుమామిళ్ల : రాష్ట్రంలో ఏళ్ల తరబడి పని చేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ అనుబంధ విద్యుత్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం అంబేడ్కర్ భవన్‌లో జరిగిన విద్యుత్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల ఇన్సూరెన్స్ కార్మికులకు ఇవ్వాలన్నారు. పీఆర్సీ అరియర్స్ కాంట్రాక్టు ఉద్యోగులకు ఇవ్వాలని, కొత్త ఆపరేటర్లకు పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలని, ప్రతి సబ్‌స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్ ఉండాలన్నారు. హెల్త్ కార్డులు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. ఆగస్టు 8న చలో విద్యుత్‌సౌధ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సబ్‌డివిజన్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నౌషద్, మహబూబ్‌పీర్‌లను ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వీరయ్య, ఉపాధ్యక్షులుగా ఈశ్వరయ్య, సుధాకర్, సిద్ధారెడ్డి, నబీ, సహాయ కార్యదర్శులుగా రమణారెడ్డి, రమణ, సురేంద్ర, కాశికొండయ్య, చంద్ర, ట్రెజరర్‌గా రమణారెడ్డిలను ఎన్నుకొన్నారు. మరో ఎనిమిది మందిని కమిటీ మెంబర్లుగా ఎన్నుకొన్నారు.

స్వామి వివేకానంద కలలను నిజం చేయాలి



శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు : స్వామి వివేకానంద కన్న కలలను యువత నిజం చేసేందుకు కృషి చేయాలని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం 77వ ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం, జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ కృషి చేస్తోందని తెలిపారు. ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై నిరంతరం ఏబీవీపీ పోరాటం చేస్తున్నదన్నారు. జాతీయ పునర్నిర్మాణం లక్ష్యంగా చేసుకుని స్వామి వివేకానందుని స్ఫూర్తితో పనిచేస్తున్నామన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శరణ్‌కుమార్, నగర కార్యదర్శి వివనారాయణ పాల్గొన్నారు.

'చెరుకూరి' వందల కోట్ల భూ దందా

వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చాపాటి నారాయణరెడ్డి



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణరెడ్డి

పోరుమామిళ్ల : మండలంలోని రంగసముద్రం పంచాయతీ కమ్మవారిపల్లెకు చెందిన చెరుకూరి వీర చెంద్రాయుడు.. పంచాయతీలో వందల కోట్ల రూపాయల భూముల కబ్జాలు, ఆక్రమణలు చేశాడని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చాపాటి లక్ష్మీనారాయణరెడ్డి ఆరోపించారు. సోమవారం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగసముద్రం చెరువు ఆయకట్టు చైర్మన్‌గా ఉన్న వీర చెంద్రాయుడు చెరువు లోతట్టులో ఆక్రమణలు తొలగించకుంటే నిరాహార దీక్ష చేస్తానని ప్రచారం చేసుకుంటున్నాడని, ఆయన ధనబలం, రాజకీయబలంతో అధికారులను ప్రలోభపెట్టి అక్రమించుకున్న వందల కోట్ల విలువ చేసే భూములు ముందుగా ప్రభుత్వ స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ గద్దలా వాలిపోయి, అధికారులను నయానో భయానో మభ్యపెట్టి, భయపెట్టి, ప్రలోభపెట్టి తనకు అనుకూలంగా చేసుకొని రాత్రికి రాత్రి రికార్డులు తారుమారు చేసి భూకబ్జాలకు తెరలేపి సొంతం చేసుకున్న చరిత్ర వీర చెంద్రాయుడిదని ఆరోపించారు. అది ప్రభుత్వ భూమైనా, ప్రైవేటు భూమైనా తమ సొంతం కావాల్సిందే అన్న ఆలోచనతో చెరుకూరి వీరచెంద్రాయుడు దాదాపు రూ.100 కోట్లు విలువ చేసే భూములు కబ్జా చేశాడని ఆరోపించారు. రంగసముద్రం పొలం సర్వే నెంబర్ 75లో 3.22 ఎకరాల భూమి (రూ. 5 కోట్లు విలువ) 2017లో డీకేటీ పట్టా పొందాడని, అందుకు ఎలా అర్హుడో ఆయన చెప్పాలన్నారు. సర్వే నెంబర్ 419లో 0.74 సెంట్లు అనువంశికం కింద ఆన్‌లైన్ చేయించాడని, సర్వే నెంబర్ 432లో 0.94 సెంట్లు అనువంశికం కింద ఆన్‌లైన్ చేయించాడని, ఇవి చుక్కల భూములని ఎలా అనువంశికం అయ్యాయని ప్రశ్నించారు.

అధికారులు సమగ్ర విచారణ చేయాలి

చెంద్రాయుడు అన్న చెరుకూరి చెన్నక్రిష్ణయ్య ఆక్రమణలోని సర్వేనెంబర్ 68, 69 లో డీకేటీ భూములు దాదాపు రూ. 80 కోట్లు విలువ చేస్తాయని, వాటి ఎన్‌ఓసీ కోసం మాజీ సైనికోద్యోగి చాటకొండు నాగరాజు పేరుకు 4-7-2019లో ఆన్‌లైన్ చేయించ లేదా? అన్నారు. ఈ ఘటనలో లక్షలాది రూపాయలు రెవిన్యూ అధికారులకు ఇచ్చారని ఆరోపించారు. ఆ భూముల ఎన్ఓసీ అంశంలో ఉన్నతాధికారులనే బురిడీ కొట్టించడంలో వీర చెంద్రాయుడు పాత్ర లేదా? అని ప్రశ్నించారు. సుందరయ్యకాలనీకి దక్షణాన సర్వేనెంబర్ 136-5లో సి.నాగరాజు పేరుతో ఆర్మీ కోటాలో 5 ఎకరాలు భూమి పొంది, దాన్ని వీరచెంద్రాయుడు స్వాధీనం చేసుకొని మామిడి చెట్లు సాగు చేశాడన్నారు. ఆ భూమి విలువ రూ.10 కోట్లు చేస్తుందన్నారు. చాటకొండు నాగరాజు, సి.నాగరాజు పేర్లతో ఆక్రమించుకున్న భూములపై జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరిపి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వీరచెంద్రాయుడు అన్న చెరుకూరి చెంద్రాయుడు ఆర్టీసీ బస్టాండు ముందు సీసీఆర్ లాడ్జి నిర్మించి, లాడ్జి ముందున్న 22 అడుగుల పంటకాలువను పూడ్చి దానిపై రూములు కట్టాడన్నారు. పోరుమామిళ్ల చెరువు నుండి రంగసముద్రం చెరువుకు వెళ్లే పంటకాలువను పూడ్చడం వల్ల కోట్ల విలువ చేసే స్థలం లాడ్జి పరిధిలోకి వెళ్లిందన్నారు. వీరచెంద్రాయుడు ముందుగా రంగసముద్రం చెరువు ఆయకట్టు చైర్మన్‌గా పంటకాలువ ఆక్రమణ తొలగించాలని, ఆర్టీసీ బస్టాండు నుండి చెరువు వరకు కాలువను పూర్వ స్థితికి తేవాలని కోరారు. వీరచెంద్రాయుడు తాను చేసిన భూదందాలు బయట పెట్టాలని, చెరుకూరి ఆక్రమణలో ఉన్న కోట్లాది రూపాయల విలువ చేసే భూములు, స్థలాలు స్వచ్ఛందంగా ప్రభుత్వానికి స్వాధీనం చేయాలని నారాయణరెడ్డి డిమాండ్ చేశారు.